వున్నాయి. కుప్పకూలిపోయింది అలివేలమ్మ.

అలివేలమ్మ పెళ్లయి కాపురానికొచ్చినపుడు ఇంకా అపుడే కొత్తగా ఉద్యోగంలో చేరాడు శివనాగేశ్వరరావు. భార్య మాటకు ఎదురు చెప్పేవాడు కాదు. భర్తకు తెలియకుండా పదో పరకో మిగిలించి ఇరుగు పొరుగువారికి అప్పులిచ్చి ఖచ్చితంగా వసూలు చేసేది. భర్త డ్యూటీకి పోయాడంటే సరిగా అన్నం కూడా వండేది కాదు. ఉన్నదాంతో సర్దుకుపోయేది . ఒక కూతురు పుట్టగానే భర్త వద్దంటున్నా వినకుండా ఆపరేషన్ చేయించుకుంది అలివేలమ్మ. ఆ ఒక్క కూతురిని గవర్నమెంటు హాస్టలులో చేర్పించింది. తినీ తినక ఇరవైయేళ్లనుండి దాచినదంతా హుష్‌కాకి. రాత్రంతా కంటి మీద కునుకే లేకుండా గడిపింది. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూడసాగింది.

ఐదు గంటలకే తలుపు తీసింది. ఇంకా నిద్రమత్తులో తూగుతున్న ఇరుగుపొరుగు వారందరినీ లేపింది. అందరిముందు తన గోడు వెళ్లబోసుకుంది.

'అన్నిట్లోను అతిగుట్టు పనికిరాదమ్మా. ఇప్పుడేం జరిగిందో చూశావుగదా. అయినా ఇప్పుడేం చేస్తాం తెల్లవారనీ, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రిపోర్టిద్దాం. అంతకంటే ఏం చేయగలం' అన్నారందరూ.

పోలీస్ రిపోర్టు ఇచ్చి భర్తకోసం ఎదురు చూడసాగింది అలివేలమ్మ. రెండ్రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు శివనాగేశ్వరరావు. విషయం విని అవాక్కయ్యాడు. భార్యతో కలిసి ఎస్.ఐను వెంటబెట్టుకొని ఆదోనికి వెళ్లాడు. ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు అందరిని చూసింది అలివేలమ్మ. అసలు నాగరాజు పేరుతో కండక్టరు ఎవరూ లేరని తేలింది. ముఖం వేలాడేసుకుని వెనుదిరిగి వచ్చారు."మా ప్రయత్నం మేం చేస్తామండి. ఆపై మీ అదృష్టం" అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

"మనం మాట్లాడుకునే విషయాలు విని, మన అడ్రస్‌లు తెలుసుకుని, మన ఇంటికి వచ్చి, మనల్ని నట్టేట ముంచే నాగరాజులాంటి క్లోజ్ ఫ్రెండ్స్‌ను ఎప్పటికీ మరచిపోలేం. ఇంతవరకు పోయిన సొమ్ము దొరకలేదు. ఇంత మోసం చేసిన ఆ క్లోజ్‌ఫ్రెండ్ ఎవరో అంతుచిక్కలేదు" గొణుక్కుంటూ డ్యూటీకి బయలుదేరాడు శివనాగేశ్వరరావు.

-టి.రామాంజనేయులు
(హాలహర్వి)

ఐడియా

సాయంత్రం ఐదవుతోంది.

వెళ్లేది యింటికే అయినా ఏదయినా టిఫిన్ తిని వెళ్దామనిపించి కనిపించిన హోటల్‌లో దూరాను. టిఫిన్‌కి ఆర్డరిచ్చి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను.

''హలో! బాగున్నారా?'' ఎవరో పలకరించినట్లయితే తలెత్తి చూశాను. ఎవరో ఓ పాతికేళ్ల యువతి. చిరునవ్వుతో నన్నే చూస్తూవుంది. ''హలో'' అన్నాను సందిగ్ధంగా.

''అదేంటండీ? నన్ను గుర్తుపట్టలేదా? మీ ఫ్రెండ్ సుబ్బారావు చెల్లెల్ని. నా పేరు లీల! అవున్లెండి. మీరు మన ఊరు వదిలి ఓ పదేళ్లు అయివుంటుంది కదా! అప్పటికి మేము చిన్నవాళ్లం మీరు ఏమీ మారలేదు. కనుక నేను గుర్తుపట్టాను'' గలగలా మాట్లాడేస్తున్నదామె.

ఇంతలో సర్వర్ టిఫిన్ తెచ్చి నా ముందు పెట్టాడు. ఎదురుగా ఆమె వుండగా నేనొక్కణ్నే ఎలా తినటం? ఆమె ఎవరో, సుబ్బారావనే ఫ్రెండ్ నా చిన్నతనంలో నాకుండేవాడో లేదో, ఇదంతా నాకేం జ్ఞాపకం రావటం లేదు. కానీ కర్టెసీ అనేదొకటి ఏడ్చింది కదా! అందుకే సర్వర్‌ని ఆమెకి కూడా టిఫిన్ తెమ్మని చెప్పాను.

''అబ్బే! ఎందుకండీ, ఈ టైంలో టిఫిన్ తినే అలవాటు నాకు లేదు'' అందామె కాస్త సిగ్గుపడ్తున్నట్టుగా. 'మరెందుకొచ్చినట్లిక్కడికి? ఏమో కాఫీ కేమో' నాలో నేను అనుకుని సర్వర్ తెచ్చిన టిఫిన్ ప్లేటు ఆమె ముందుకు తోసి సర్వర్‌తో రెండు కాఫీ అని చెప్పి, తినటం మొదలుపెట్టాను. తప్పదన్నట్లుగా ఆమె కూడా తినటం మొదలుపెట్టింది. ఎంత గుర్తు చేసుకున్నా నాకు సుబ్బారావుగానీ అతని చెల్లెలుగానీ గుర్తురావటం లేదు. కానీ ఒక అమ్మాయి అనవసరంగా 'మీ ఫ్రెండ్ చెల్లెల్ని' అని ఎందుకు చెప్తుందీ అని ఒక అనుమానం. ఆలోచిస్తూనే కాఫీ త్రాగటం ముగించాను. సర్వర్ వచ్చి బిల్లిచ్చి వెళ్లాడు. ఆ అమ్మాయి చప్పున బిల్లు తను అందుకుని ''చాలారోజుల తర్వాత కలిశాం కదా! బిల్లు నేనిస్తాను'' అంటూ భుజానికి వెళ్లాడుతున్న బ్యాగ్ తెరిచి బిల్ పేచేసింది.

నాకు మాట్లాడే అవకాశం కూడా యివ్వకుండా తర్వాత గట్టిగా నవ్వి నా చెయ్యి పట్టుకుని ఊపేస్తూ ''థాంక్సండీ'' అంది.

నాక్కొంచం చిరాకనిపించింది. అయినా

తమాయించుకున్నాను. ఎందుకంటే రేపెప్పుడయినా ఆ సుబ్బారావెవరో నన్ను కలిస్తే, తన చెల్లెల్ని నేను విసుక్కున్నానని తెలిస్తే బాగుండదు కదా! అందుకే నన్ను నేను కంట్రోల్ చేసుకుని ''బిల్ మీరే పే చేశారు గదా! ఇంక థాంక్సెందుకు? చెప్తే గిప్తే నేనే గదా థాంక్స్ చెప్పాలి'' అన్నాను. ఎంత దాచుకున్నా నా మాటల్లో విసుగు కనిపించిందేమో ఆమె కొంచెం చిన్నబుచ్చుకుంది. మళ్లీ వెంటనే హుషారు తెచ్చుకుని ''నా పెళ్ళి ఆపేసినందుకు మీకు థాంక్స్ చెప్పాల్సిందేనండీ'' అని కిలకిలా నవ్వింది. నా చెయ్యి మాత్రం వదలలేదు.

నాకు మతిపోయినంత పనైంది. ఏమంటోందీ అమ్మాయి? అదే అడిగాను ఆశ్చర్యంగా.

''ఓహ్ సారీ సర్! మీకు అసలు సంగతి తెలియదు కదా! చెప్తాను వినండి. నేను మా క్లాస్‌మేట్‌ని ప్రేమించాను. మేమిద్దరం పెళ్లి కూడా చేసుకుందామని డిసైడయ్యాము. ఇంతలో మా పెద్దవాళ్లు నాకో పెళ్లిసంబంధం చూశారు. వాళ్లకి నా ప్రేమ విషయం చెప్పినా పెద్దగా పట్టించుకోరు. అందుకే డైరెక్ట్‌గా పెళ్లికొడుక్కే ఫోన్ చేసి ఈ హోటల్‌కి ఈ టైంకి రమ్మని చెప్పాను. చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి అని చెప్పాను. అదిగో చూడండి ఆ చివర టేబుల్ దగ్గర కూర్చుని మనల్నే చూస్తున్నాడు. అతనే మా వాళ్లు చూసిన పెళ్లికుమారుడు. ఇప్పుడు మనిద్దరినీ యింత క్లోజ్‌గా చూశాక కూడా నన్ను పెళ్లి చేసుకుంటాననలేడు కదా! నాకది చాలు'' నా చెయ్యి ఊపేస్తూ మళ్లీ నవ్విందామె.

ఆమె చూపించిన వైపు చూసిన నేను స్థాణువైనాను. ఆమె చేతిలోంచి నా చెయ్యి గభాల్న వెనక్కి లాక్కున్నాను. ''మీకు చాలు సరే! మీకష్టం తీరింది. కానీ నాకిప్పుడే కష్టాలు మొదలయ్యాయి. అయినా హోటల్లో యింతమంది వుండగా మీ ప్రయోగానికి నేనే దొరికానా?'' అంటూ నీరసంగా కుర్చీలో కూలబడ్డాను.

''అహ అదికాదు. అందరిలోకి మీరు పెద్దమనిషిలా కనబడితేనూ. తర్వాత దీనివలన నాకే యిబ్బందీ రాకూడదు కదా! అందుకనే మిమ్మల్ని ఎంచుకున్నాను. అయినా మీరలా ఎందుకంటున్నారు? ఎనీథింగ్ రాంగ్?'' ఆత్రుతగా అడిగిందామె.

''యెస్! ఎవ్రీథింగ్ రాంగ్! అతనెవరనుకున్నారు? నా కాబోయే బావమరిది. ఇంకో వారం రోజుల్లో నా పెళ్లి జరగాల్సి వుంది. అఫ్‌కోర్స్! పెళ్లి ఆగకపోవచ్చు. కానీ తర్వాత నా కష్టాలు తల్చుకుంటేనే భయంగా వుంది'' అన్నాను.

-సాధనాల నాగవర్ధని
(నూజివీడు)